E-KABURU E-PAPER
# ఈ-కబురు
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం
@ekaburu.com
(తేదీ) 11-08-2025 (వారం) మంగళవారం హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com



తెలంగాణకు భారీ వర్ష సూచన.. వాతావరణ శాఖ హెచ్చరిక
» 3లో



## ట్రంప్‌కు ప్రధాని మోదీ కౌంటర్!

ఈ కబురు:, బెంగళూరు: భారత్ 'డెడ్ ఎకానమీ' అంటూ ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలకు ప్రధాని నరేంద్ర మోదీ స్ట్రాంగ్ కౌంటరిచ్చారు. ప్రపంచంలో భారత్ మూడో ఆర్థిక శక్తిగా ఎదగడానికి ఎంతో సమయం పట్టదంటూ స్పష్టం చేశారు. ఈరోజు(ఆదివారం, ఆగస్టు 10వ తేదీ) బెంగళూరులో మెట్రో ఫేజ్3 కి శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన మోదీ ప్రసంగించారు. భారత్ మూడో ఆర్థిక శక్తి కాబోతుందంటూ ఆయన స్పష్టం చేశారు. రిఫార్మ్, పెర్‌ఫార్మ్, ట్రాన్స్‌ఫార్మ్ అనేవి భారత్ ఆర్థికంగా ఎదగడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. 'గత 11 ఏళ్లలో భారత ఆర్థికంగా బలోపేతమైంది. 10వ స్థానం నుంచి 5 స్థానానికి వచ్చాం. ఇప్పుడు మూడో ఆర్థిక శక్తిగా ఎదిగే ట్రాక్‌లో ఉన్నాం. కచ్చితమైన, నిజాయితీ పరమైన దృష్టి పెట్టడంతోనే ఇది సాధ్యమవుతూ వస్తుంది. అందుకే ప్రపంచంలో మూడో ఆర్థిక శక్తిగా ఎదగడానికి మనం దగ్గర్లోనే ఉన్నాం,' అని తెలిపారు. 2014 నాటికి మన దేశంలో ఐదు నగరాల్లో మాత్రమే మెట్రో రైలు అందుబాటులో ఉండేది. ఇప్పుడు 24 నగరాల్లో ఆ సేవలు అందుబాటులోకి వచ్చాయి.

తరువాయి 2లో

## వరదను కట్టడి చేద్దాం..

- మైత్రి వనం వద్ద నీరు నిలిచిపోవడంపై ఆరా..
- డ్రైనేజీ వ్యవస్థ మార్పు చేర్పులపై అధికారులకు సూచనలు
- ఏడో తరగతి బాలుడితో కలిసి బౌద్ధనగర్‌లో తిరిగిన రేవంత్
- వరద నీటితో ఇంట్లో పుస్తకాలు తడిచిపోయాయన్న జశ్వంత్
- ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామన్న సీఎం
- హైదరాబాద్‌లోని అమీర్‌పేట, ఎస్సార్‌నగర్ ప్రాంతాల్లో ఆకస్మిక పర్యటన
- బౌద్ధనగర్, గంగుబాయి బస్తీ, రిలయన్స్ లైన్‌లలో డ్రైనేజీ నాలాల పరిశీలన
- భారీ పైపులతో కూడిన వ్యవస్థ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్న సీఎం



తరువాయి 2లో

ఈ కబురు: హైదరాబాద్/అమీర్‌పేట: భారీ వర్షాలతో అతలాకుతలం అవుతున్న హైదరాబాద్‌లోని అమీర్‌పేట, ఎస్సార్‌నగర్‌ల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం ఆకస్మికంగాపర్యటించారు. ఆయా ప్రాంతాలను వరద, ముంపు ముప్పు నుంచి తప్పించడానికి ప్రత్యేకంగా ట్రంక్ లైన్ ఏర్పాటు చేయాల్సిందిగా ఆదేశించారు. ఈ మేరకు ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు. బౌద్ధనగర్, గంగుబాయి బస్తీ, రిలయన్స్ లైన్‌లలో ఉన్న డ్రైనేజీ నాలాలను పరిశీలించారు. మైత్రి వనం వద్ద నీరు నిలిచిపోవడానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఎస్ఆర్ నగర్ నుంచి బౌద్ధనగర్ వరకు ఉన్న మురుగునీటి కాలువను చూసిన ఆయన ఒకింత ఆశ్చర్యం వ్యక్తం చేశారు. కాలనీ రోడ్డు కంటే డ్రైనేజీ ఎక్కువ ఎత్తులో ఉండటంపై ఆరా తీశారు. ఈ కారణంగానే రోడ్డు ఇరుకుగా మారడంతో పాటు వరద బౌద్ధనగర్‌ను ముంచుతోందని గుర్తించారు.



## రాహుల్‌కు బిహార్ ఓటమి భయం

- అందుకే నకిలీ ఓట్లు అంటూ ప్రచారం కాంగ్రెస్ గెలిచిన రాష్ట్రాల్లో నకిలీ ఓట్లు లేవా
- ఢిల్లీ టూర్లు ఆపి రేవంత్ హైదరాబాద్..వాసుల కష్టాలు చూడాలి: రాంచందర్‌రావు
- బీజేపీలో చేరిన మాజీ ఎమ్మెల్యే గువ్వల

తరువాయి2 లో

భారత్‌లో టెస్లా బిగ్ డీల్!.. నెలకు రూ.17.22 లక్షల రెంట్
» 4లో



అభిమానులకి శిరస్సు వంచి నమస్కరించిన తారక్
» 5లో



## బనకచర్లను అడ్డుకుంటాం



- తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు కట్టి తీరుతాం
- దేవాదుల పూర్తికి ప్రాధాన్యం: భట్టి, ఉత్తమ్

తరువాయి 3లో

స్ఫూర్తిదాయక 'పరదా'
» 5లో





» 3లో
ఒకే మహిళ రెండుసార్లు ఓటు' ఆరోపణలు.. రాహుల్ గాంధీకి నోటీసులు

## కాంగ్రెస్‌కు అవినీతి గనిగా సింగరేణి



- కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మళ్లీ రాజకీయ అవినీతి పెరిగింది
- హెచ్ఎంఎస్‌తో కలసి సింగరేణి జాగృతి పనిచేస్తుంది
- కార్మికులకు 37 శాతం బోనస్ ప్రకటించాలి
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

ఈ కబురు: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సింగరేణి అవినీతి గనిగా మారిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. ఉద్యోగ నియామకాలతో పాటు అన్నింట్లో కాంగ్రెస్ పార్టీ అవినీతికి పాల్పడుతోందని ఆరోపించారు. జైపూర్ థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణ అంచనా వ్యయాలను రాత్రికి రాత్రే అమాంతం పెంచారని దుయ్యబట్టారు. సింగరేణిని కాపాడాలన్న ఉద్దేశంతో కేసీఆర్.. సంస్థలో రాజకీయ అవినీతిని అంతం చేశారని, కానీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ రాజకీయ అవినీతి పెరిగిందని దుయ్యబట్టారు. కార్మికులకు భరోసా ఇవ్వడానికి త్వరలో సింగరేణి యాత్ర చేపడతామని ప్రకటించారు. ఆదివారం బంజారా హిల్స్ లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్, ఎమ్మెల్సీ కవిత సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ జాగృతి అనుబంధ సంస్థ అయిన సింగరేణి జాగృతి, హెచ్ఎంఎస్ సంఘం కలిసి పనిచేయాలని నిర్ణయించారు.

తరువాయి2లో

## 100 కేసులు.. 109 పరిష్కారం



- క్రిమినల్ కేసుల విచారణలో హైకోర్టు రికార్డు
- వేగవంతంగా విచారణ, పరిష్కారం
- సివిల్ కేసుల్లోనూ పరిష్కార రేటు 94 శాతం
- సౌకర్యాలు కల్పిస్తే మరింత వేగంగా పరిష్కారం

ఈ కబురు:, హైదరాబాద్: క్రిమినల్ కేసుల్లో తెలంగాణ హైకోర్టు సత్వర పరిష్కారం చూపిస్తోంది. సగటున నమోదైన 100 కేసులకు పాత కేసులతో కలిపి 109 కేసులను పరిష్కరిస్తోంది. సివిల్ కేసుల్లో 94 శాతం పరిష్కారంతో కేసుల విచారణ సాగిస్తోంది. హైకోర్టులో ఇప్పటికి దాదాపు 2.35 లక్షల కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. 30 శాతం న్యాయమూర్తుల స్థానాలు ఖాళీగా ఉన్నా.. పరిష్కారం శాతంలో దేశానికి ఆదర్శంగా నిలుస్తోంది.

తరువాయి 2లో

ఆసియాకప్ గెలిచేది ఆ జట్టే: సౌరవ్ గంగూలీ
» 6లో





మరో మార్గం లేదు 'గాజా ఆక్రమణ'పై నెతన్యాహు
» 3లో

## త్వరలోనే టాప్3లోకి పరుగులు పెడుతున్న దేశ ఆర్థికవ్యవస్థ

» 3లో



మొదటి పేజీ తరువాయి

# వరదను కట్టడి చేద్దాం..



బాలుడి భుజంపై చేయి వేసి నడుస్తూ..
బౌద్ధనగర్‌లో పర్యటించిన సీఎం రేవంత్‌రెడ్డికి ఏడో తరగతి బాలుడు జశ్వంత్ వరద సమస్యను వివరించాడు. బస్తీలో మహిళలతో కలిసి నిలబడి ఉన్న జశ్వంత్‌ను పిలిచిన రేవంత్‌రెడ్డి వరద పరిస్థితిపై ఆరా తీశారు. ఆ బాలుడి భుజంపై చేయి వేసి కాలనీలో నడుచుకుంటూ వివరాలను తెలుసుకున్నారు. తాను ఏడో తరగతి చదువుతున్నానని, వర్షాకాలంలో చదువులకు దూరం అవుతున్నానని బాలుడు సీఎంకు తెలిపాడు. శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వరద నీరు ఇంట్లోకి వచ్చి పుస్తకాలు తడిసిపోయాయని చెప్పాడు. దీంతో భవిష్యత్తులో వరద పరిస్థితులు తలెత్తకుండా శాశ్వత పరిష్కారం చూపిస్తామని బాలుడికి సీఎం హామీ ఇచ్చారు. మరోవైపు వరద నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని అమీర్‌పేట కార్పొరేటర్ కేతినేని సరళ.. సీఎంను కోరారు. స్థానిక డ్రైనేజీ వ్యవస్థ వివరాలను ఆమె వెల్లడించారు. ఎర్రగడ్డ, యూసుఫ్‌గూడ ప్రాంతం నుంచి వరద నీరు పెద్ద ఎత్తున వస్తోందని, లెవలింగ్ సరిగా లేకపోవడంతో వరద నీరు నాలాల్లోకి వెళ్లక కొన్ని బస్తీలు ముంపునకు గురవుతున్నాయని వివరించారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్, జీహెచ్ఎంసీ, జల మండలి అధికారులు సీఎం వెంట ఉన్నారు.

ట్రంక్ లైన్ అంటే ఏమిటి?
హైదరాబాద్ మహానగర మురుగునీటి వ్యవస్థలో సుమారు 612 కిలోమీటర్ల మేర ప్రధాన సీవరేజీ ట్రంక్ లైన్ ఉండగా వాటికి అనుబంధంగా సుమారు 9,769 కిలోమీటర్ల వరకు మురుగు నీటి పైప్‌లైన్ విస్తరించి ఉంది. ఈ మొత్తం వ్యవస్థలో ట్రంక్ లైన్ కీలకం. చిన్న చిన్న పైపుల ద్వారా వచ్చే మురుగునీటిని భారీ పైపుల్లోకి మళ్ళించి వ్యర్థ జలాల శుద్ధి కేంద్రానికి లేదా మురుగు నీటిని వదిలే ప్రదేశానికి పంపించడాన్ని ట్రంక్ లైన్ వ్యవస్థగా పిలుస్తున్నారు. ట్రంక్ లైన్లు సాధారణంగా పెద్ద వ్యాసం (600 డయా (2.5 మీటర్లు) తో కూడిన పైపులను కలిగి ఉంటాయి. పెద్ద మొత్తంలో మురుగునీటిని ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి తరలించడంలో కీలక పాత్ర పోషిస్తాయి.

మంచిగా చదువుకో అన్నారు..!
మా కాలనీలో నన్ను చూసిన ముఖ్యమంత్రి..'బాబు ఇక్కడ రా' అని పిలిచారు. 'నిన్న మీ ఇంటి దగ్గరకు వాటర్ వచ్చాయి కదా? ఎంత వచ్చాయి?' అని అడిగారు. నేను మునిగిపోయేంత వచ్చాయని చెప్పా. మీకు ఇంటికి ఏమైనా మరమ్మతులు కావాలా? అని అడిగితే..అవును సార్..గేట్లు పెట్టియ్యాలె సార్ అని అన్నా. పెట్టిస్తానన్న సీఎం..పుస్తకాలు తడిచాయా? అంటూ ఆరా తీశారు. 'మంచిగా చదువుకో.. మళ్లీ వాటర్ వస్తే నాకు ఫిర్యాదు చెయ్యి కవర్ చేసేస్తా..' అని హామీ ఇచ్చారు.
- జశ్వంత్, ఏడో తరగతి విద్యార్థి, బౌద్ధనగర్



మొదటి పేజీ తరువాయి

# కాంగ్రెస్‌కు అవినీతి గనిగా సింగరేణి



సంస్థలో రాజకీయ అవినీతిని అంతం చేశారని, కానీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ రాజకీయ అవినీతి పెరిగిందని దుయ్యబట్టారు.కార్మికులకు భరోసా ఇవ్వడానికి త్వరలో సింగరేణి యాత్ర చేపడతామని ప్రకటించారు. ఆదివారం బంజారాహిల్స్ లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్, ఎమ్మెల్సీ కవిత సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ జాగృతి అనుబంధ సంస్థ అయిన సింగరేణి జాగృతి, హెచ్ఎంఎస్ సంఘం కలిసి పనిచేయాలని నిర్ణయించారు. అనంతరం కవిత విలేకరులతో మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పడిన తర్వాత సింగరేణిని కాపాడుకోవాలన్న కృతనిశ్చయంతో కేసీఆర్ ఎంతో కృషి చేశారని, ఇప్పుడు దాదాపు 40 వేల మంది ఉద్యోగులతో సింగరేణి కలకళలాడుతోందని అన్నారు. సింగరేణిలో భూగర్భ గనులను తెరవాలని డిమాండ్ చేశారు. ఇచ్చేది తక్కువ.. పైగా పన్ను: సింగరేణి కార్మికులకు ప్రభుత్వం ఇచ్చేది చాలా తక్కువగా ఉంటుందని, పైగా జీతంపై ప్రధాని మోదీ ఆదాయపు పన్ను కూడా విధిస్తున్నారని ఎమ్మెల్సీ కవిత మండిపడ్డారు. సింగరేణి ఉద్యోగులకు ఆదాయపు పన్ను రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 22 వేల మంది కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఉన్నతస్థాయి కమిటీ చేసిన సిఫారసుల మేరకు వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత బోనస్ విషయంలో కార్మికులను కాంగ్రెస్ ప్రభుత్వం వంచనకు గురి చేసిందని, లాభాల్లో 33 శాతం వాటా బోనస్‌గా ఇస్తున్నామని చెప్పి అసలు లాభాలనే తక్కువ చేసి చూపించారని ఆగ్రహం వ్యక్తం చేశారు.సింగరేణి కార్మికులకు ఈ ఏడాది దసరా బోనస్‌గా లాభాల్లో 37 శాతం వాటా ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. హెచ్ఎంఎస్ కార్మిక సంఘంతో కలసి సింగరేణి జాగృతి పనిచేస్తుందని స్పష్టం చేశారు. ఈ కలయిక భవిష్యత్తులో అన్ని వామపక్ష పార్టీల అనుబంధ సంఘాల ఐక్యతకు దారితీస్తుందని చెప్పారు. కాగా, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘానికి (టీబీజీకేఎస్) తాను గౌరవ అధ్యక్షురాలిగా ఉన్నానని, కాబట్టి క్షేత్రస్థాయిలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా పనిచేస్తున్న ప్రతీ ఒక్కరు కలసి పనిచేయాల్సిందేనని పేర్కొన్నారు.

# ట్రంప్‌కు ప్రధాని మోదీ కౌంటర్!



**ఈరోజు( ఆదివారం, ఆగస్టు 10వ తేదీ) బెంగళూరులో మెట్రో ఫేజ్-3 కి శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన మోదీ ప్రసంగించారు. భారత్ మూడో ఆర్థిక శక్తి కాబోతుందంటూ ఆయన స్పష్టం చేశారు. రిఫార్మ్, పెర్‌ఫార్మ్, ట్రాన్స్‌ఫార్మ్ అనేవి భారత్ ఆర్థికంగా ఎదగడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు.**

**'గత 11 ఏళ్లలో భారత ఆర్థికంగా బలోపేతమైంది. 10వ స్థానం నుంచి 5 స్థానానికి వచ్చాం. ఇప్పుడు మూడో ఆర్థిక శక్తిగా ఎదిగే ట్రాక్‌లో ఉన్నాం. కచ్చితమైన, నిజాయితీ పరమైన దృష్టి పెట్టడంతోనే ఇది సాధ్యమవుతూ వస్తుంది. అందుకే ప్రపంచంలో మూడో ఆర్థిక శక్తిగా ఎదగడానికి మనం దగ్గర్లోనే ఉన్నాం,' అని తెలిపారు.2014 నాటికి మన దేశంలో ఐదు నగరాల్లో మాత్రమే మెట్రో రైలు అందుబాటులో ఉండేది. ఇప్పుడు 24 నగరాల్లో ఆ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఇది ప్రపంచంలో మూడో అతిపెద్ద మెట్రో నెట్‌వర్క్. 2014 నాటికి ఆల్ ఇండియా మెడికల్ ఇన్‌స్టిట్యూట్‌లు అనేవి ఏడు, మెడికల్ కాలేజీలు 387 ఉండేవి. ఇప్పుడు మెడికల్ ఇన్‌స్టిట్యూట్‌లు 22, మెడికల్ కాలేజీలు 704 ఉన్నాయి. ఎలక్ట్రికల్ రైళ్లు 2014 నాటికి 20వేలు మాత్రమే ఉంటే నేటికి అవి 40వేలు అయ్యాయి. ఇక ఎయిర్‌పోర్ట్‌లు 74 నుంచి 180కు పెరిగాయి' అని ప్రభుత్వం సాధించిన ఘనతలను చెప్పకొచ్చారు మోదీ.**

మొదటి పేజీ తరువాయి

# త్వరలోనే టాప్3లోకి పరుగులు పెడుతున్న దేశ ఆర్థికవ్యవస్థ

ఈ కబురు, బెంగళూరు: ప్రపంచంలోనే మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలవాలనే లక్ష్యంవైపు భారత్ వేగంగా ప్రయాణిస్తోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. అన్ని కీలక రంగాల్లో వృద్ధి సాధిస్తూ ఆత్మనిర్భర భారత్ స్ఫూర్తిని సుదృఢం చేసుకుంటున్నామని అన్నారు. భారత్‌ది 'మృత ఆర్థికవ్యవస్థ' అని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇటీవల వ్యాఖ్యానించిన నేపథ్యంలో ఆయన ఈ ప్రకటన చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఆదివారం బెంగళూరులో పర్యటించిన ఆయన.. రూ.15,610 కోట్లతో నిర్మించనున్న మెట్రో మూడోదశ నిర్మాణానికి శంకుస్థాపన చేసి, రూ.7,160 కోట్లతో అందుబాటులోకి తీసుకొచ్చిన మెట్రో ఎల్లోలైన్ సర్వీస్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ... శత్రువులు సరిహద్దుల ఆవల ఎంత దూరంలో ఉన్నా తప్పించుకోలేరని ఆపరేషన్ సిందూర్‌తో రుజువైందని పేర్కొన్నారు. ఉగ్రవాదులకు మద్దతిచ్చే పాకిస్థాన్‌ను గంటల్లోనే మోకాళ్లపై కూర్చోబెట్టిన భారత్.. ప్రపంచానికి తన కొత్త శక్తిని పరిచయం చేసిందని ప్రధాని వ్యాఖ్యానించారు. ఆపరేషన్ సిందూర్ విజయంలో ఆధునిక సాంకేతికత ప్రభావాన్ని, మేకిన్ ఇండియా పాత్రను ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. "గత 11 ఏళ్లలో ఆర్థికవ్యవస్థల్లో పదో స్థానం నుంచి టాప్ 5లోకి చేరుకున్నాం. టాప్3లోకి ప్రవేశించడానికి వేగంగా ముందుకెళుతున్నాం. 2014లో ఐదు నగరాల్లోనే మెట్రో సర్వీసులు ఉండేవి. ఇప్పుడు ఆ సంఖ్య 24కు చేరుకుంది. 2014కు ముందు రైల్వేలో 20 వేల కిలోమీటర్లకే విద్యుదీకరణ జరగగా కేవలం 11 ఏళ్లలో 40వేల కిలోమీటర్లకు చేర్చాం. విమానాశ్రయాల సంఖ్యను 74 నుంచి 160కి తీసుకురావడం చిన్న విషయమేమీ కాదు. ఎయిమ్స్, ఐఐటీ, ఐఐఎంల సంఖ్య మూడు రెట్లు పెరిగింది. డిజిటల్ చెల్లింపుల్లో ప్రపంచంలోనే అత్యధిక వినియోగదారులున్న దేశంగా అవతరించాం. ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులు, మొబైళ్లను విదేశాలకు ఎగుమతి చేసే స్థాయికి భారత్ చేరుకుంది' అని ప్రధాని పేర్కొన్నారు. కేంద్రం, రాష్ట్రాలు సమన్వయంతో ప్రయాణిస్తే వికసిత్ భారత్ లక్ష్యాలను వేగంగా చేరుకోవడానికి వీలవుతుందని ఆయన సూచించారు. అంతకుముందు కేఎస్ఆర్ బెంగళూరు రైల్వేస్టేషన్‌లో బెంగళూరుబెళగావి వందే భారత్‌ను నేరుగా, అమృత్‌సర్‌మాతా వైష్ణోదేవి కాట్రా, నాగ్‌పూర్‌పుణె వందేభారత్ రైళ్లను వర్చువల్‌గా ప్రారంభించారు.బెంగళూరు మెట్రో ఉమ్మడి ప్రాజెక్టు అయినా రాష్ట్ర వ్యయం 87.37% కాగా కేంద్రం వాటా 12.63% మాత్రమేనని, ఈ మొత్తాన్ని పెంచాలని సీఎం సిద్ధరామయ్య అన్నారు. రుణాల రూపంలో కేంద్రం ఇచ్చిన నిధులకు రాష్ట్రం చెల్లించే మొత్తం భారంగా మారుతోందని ప్రధాని సమక్షంలోనే ప్రస్తావించారు.

**సామాన్యులతో కాసేపు..!**
బెంగళూరు మెట్రోలో కొద్దిదూరం ప్రయాణించిన ప్రధాని మోదీ.. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, ప్రయాణికులు, మెట్రో మహిళా సిబ్బందితో ముచ్చటించారు. నమ్మ మెట్రో పని విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. మరికొన్ని మార్గాల్లో మెట్రోను అందుబాటులోకి తీసుకురావాలని ప్రయాణికులు ప్రధానిని కోరారు. పైలట్ రహిత మెట్రో సంచారం గురించి బీఎంఆర్‌సీఎల్ అధికారులు వివరించారు. ఆర్వీ రోడ్డు మెట్రో ప్రాంగణం సౌరశక్తి ఆధారితమని తెలుసుకుని ప్రధాని సంతోషం వ్యక్తం చేశారు.



మొదటి పేజీ తరువాయి

# 100 కేసులు..
## 109 పరిష్కారం



కౌంటర్ల జాప్యంతో పెరుగుతున్న పెండింగ్‌లు
కేసుల సత్వర విచారణకు న్యాయస్థానం తీవ్రంగా కృషి చేస్తున్నా.. జడ్జిల ఖాళీలు, సిబ్బంది లేమితోపాటు ప్రభుత్వం వేగంగా కౌంటర్లు వేయకపోవడంతో కొన్ని కేసులు విచారణ నత్తనడకను తలపిస్తోంది. సివిల్ కేసుల్లో ఏళ్లకేళ్లు కౌంటర్లు దాఖలు చేయకుండా సర్కార్ మీనమేషాలు లెక్కిస్తుండటం పెండింగ్ శాతం పెరగడానికి ప్రధాన కారణమని న్యాయమూర్తులే పలు సందర్భాల్లో వ్యాఖ్యానించడం గమనార్హం. దేశంలోని హైకోర్టుల్లో 7 లక్షల క్రిమినల్ అప్పీళ్లు పెండింగ్‌లో ఉన్నాయి. హైకోర్టు న్యాయమూర్తుల నియామకాలకు పేర్లను కేంద్ర ప్రభుత్వం త్వరగా సిఫారసు చేయాలి. న్యాయమూర్తుల కొరతతో క్రిమినల్ అప్పీళ్లు భారీగా పెండింగ్‌లో ఉన్నాయి. ఈ సమస్యను అరికట్టాల్సి ఉంది. - సుప్రీంకోర్టు కేసులు పెద్ద సంఖ్యలో పేరుకుపోవడం కోర్టు వ్యవస్థపై తీవ్ర భారం మోపుతుంది. ఒత్తిడి పెరగడంతో న్యాయమూర్తులు కేసులను సకాలంలో విచారించి నిర్ణయం తీసుకోవడం కష్టమవుతుంది. సుదీర్ఘ జాప్యం కారణంగా సాధారణ ప్రజల్లో న్యాయ వ్యవస్థపై నమ్మకం, విశ్వాసం కోల్పోయే ప్రమాదం ఉంది. - న్యాయ నిపుణులు

ప్రధాన సమస్యలు..

**న్యాయమూర్తుల ఖాళీలు, సిబ్బంది కొరత**
**అంతంత మాత్రంగా మౌలిక సదుపాయాలు**
**న్యాయ వ్యవస్థకు అరకొర నిధుల కేటాయింపు**
**కౌంటర్ల దాఖలుకు సర్కార్ ఏళ్లకేళ్లు సమయం తీసుకోవడం**
**చట్టంలోని లోటుపాట్లను కొందరు అనుకూలంగా మార్చుకోవడం**

**సాంకేతికతపై న్యాయవాదులకు పూర్తిస్థాయిలో అవగాహన లేకపోవడం అనుకూలతలు..**
**కోవిడ్ తర్వాత వర్చువల్ విధానం అందుబాటులోకి రావడం**
**లోక్ అదాలత్‌లపై ప్రజలను విస్తృత స్థాయిలో చైతన్యం చేయడం**
**సివిల్ కేసుల్లో మధ్యవర్తిత్వాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహించడం**
**న్యాయమూర్తులు విచారణలను వేగవంతంగా చేపడుతుండటం**
**ఆన్‌లైన్‌లోనూ న్యాయవాదులు విచారణకు హాజరవు తుండటం**
**ఇంకా ఏం చేయాలి..**
**సాంకేతికతపై కక్షిదారులకు, న్యాయవాదులకు అవగాహన కల్పించడం**
**ఒకే రకమైన కేసులను ఒకే చోట విచారణ చేపట్టడం**
**చిన్నచిన్న విచారణలకు న్యాయవాదులకు గడువు నిర్దేశించడం**
**బలమైన కారణాలుంటే తప్ప విచారణ వాయిదా వేయకుండా ఉంటడం**
**స్వల్ప కేసుల్లో వెంటవెంటనే తీర్పులు వెల్లడించడం**
**కౌంటర్ల దాఖలుకు సర్కార్‌కు గడువు విధించడం**

వాయిదాలు తగ్గితేనే..
ప్రధానంగా సివిల్ కేసుల్లో వాయిదాలు తగ్గితేనే సత్వర పరిష్కారం సాధ్యమవడంతోపాటు పెండింగ్ భారం తగ్గుతుంది. కొన్ని కేసులు ఏళ్లకు ఏళ్లు వాయిదా పడుతూ పెండింగ్ జాబితా పేరుకుపోతోంది. క్రిమినల్‌తో పాటు సివిల్ కేసులను వంద శాతానికి మించి పరిష్కారం చేయాలి. రెండేళ్లుగా జడ్జీలు సత్వర పరిష్కారానికి ప్రయత్నం చేస్తున్నా.. అదనపు భారంతో తీవ్ర ఒత్తిడి ఉంటోంది. మంజూరైన మేరకు న్యాయమూర్తుల నియామకం, మౌలిక వసతులు చేపడితే

# రాహుల్‌కు బిహార్ ఓటమి భయం



హైదరాబాద్, ఆగస్టు 10 (ఈ కబురు:) బిహార్‌లో కాంగ్రెస్ ఓడిపోతున్నట్లు తెలిసి.. ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ నకిలీ ఓట్లు అంటూ ప్రచారం చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు మండిపడ్డారు. కాంగ్రెస్ గెలిచిన తెలంగాణ, హిమాచల్, కర్ణాటకలో నకిలీ ఓట్లు గుర్తుకు రాలేదా..? అని నిలదీశారు. రాహుల్ వైఖరి చూస్తుంటే దొంగలు పడిన ఆర్నెళ్లకు కుక్కలు మొరిగినట్లు ఉందని విమర్శించారు. అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రాంచందర్‌రావు మాట్లాడారు. రాహుల్‌గాంధీ ఫేక్(నకిలీ) ఇండియన్ అని, నకిలీ ఇండియన్.. నకిలీ ఓట్ల గురించి మాట్లాడవద్దని అన్నారు. రాహుల్ నేతృత్వంలో కాంగ్రెస్ ఎప్పుడూ ఒంటరిగా గెలవలేదని.. అందుకే భాగస్వామ్య పక్షాలతో కలిసి ఎన్నికలకు వెళుతున్నారని ఎద్దేవా చేశారు. భారీ వర్షాలతో హైదరాబాద్ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని.. రేవంత్ ఢిల్లీ టూర్ల బదులు కనీసం కొన్ని రోజులైనా ఇక్కడ ఉండి ప్రజల కష్టాలను చూడాలని కోరారు. మునిసిపల్ శాఖ ఆయన వద్దే ఉందని, రేవంత్ ఢిల్లీ వెళుతుంటే ఇక్కడ ఎవరూ పట్టించుకోవడం లేదని అన్నారు. బీజేపీకి సున్నా సీట్లు వస్తాయంటూ బీఆర్ఎస్ ఎగతాళి చేసేదని, మొన్నటి ఎంపీ ఎన్నికల్లో ఆ పార్టీకే సున్నా సీట్లు వచ్చాయని ఎద్దేవా చేశారు. బీజేపీ 36 శాతం ఓట్లతో 8 ఎంపీ సీట్లు గెలుచుకుందని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ సిటింగ్ స్థానాన్ని గెలుచుకుందని గుర్తుచేశారు. తాను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడయ్యాక నెల రోజుల్లో 16 జిల్లాల్లో పర్యటించానని తెలిపారు. ఈ నెల 18 తర్వాత రెండో విడత జిల్లాల పర్యటన ఉంటుందని చెప్పారు. హైకోర్టు ఆదేశాల దృష్ట్యా త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే అవకాశం ఉందని రాంచందర్‌రావు అన్నారు. ఈ ఎన్నికల్లో ఎక్కువ శాతం సీట్లు బీజేపీ గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు.

**ఎవరి వల్ల రాష్ట్రమొచ్చిందో చర్చకు సిద్ధం: బాలరాజు**
ప్రొఫెసర్ జయశంకర్‌ను చూసే తాను టీడీపీ, కాంగ్రెస్‌లను కాదని టీఆర్ఎస్‌లో చేరానని గువ్వల బాలరాజు అన్నారు. తెలంగాణ ఎవరి వల్ల వచ్చిందో చర్చకు సిద్ధమని ప్రకటించారు. తన అహంకారం వల్లే గత ఎన్నికల్లో ఓడిపోయానంటూ బీఆర్ఎస్ నేతలు విమర్శలు చేశారని.. అలాగైతే, కేసీఆర్ ఎందుకు ఓడిపోయారని ప్రశ్నించారు. టీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు దళితుల అంశాలపై మాత్రమే మాట్లాడే అవకాశం ఇచ్చేవారని చెప్పారు. తన సతీమణిపై సోషల్ మీడియాలో పెడుతున్న పోస్టులు ఆపకపోతే తగిన బుద్ధి చెబుతామని బీఆర్ఎస్‌ను హెచ్చరించారు. ఎమ్మెల్యేనో, ఎంపీనో కావాలన్న ఆకాంక్ష లేదని బాలరాజు తెలిపారు

## తెలంగాణకు భారీ వర్ష సూచన.. వాతావరణ శాఖ హెచ్చరిక



ఈ కబురు: హైదరాబాద్:తెలంగాణలోని పలు జిల్లాల్లో సోమవారం భారీ వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట, వికారాబాద్, యాదాద్రి, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో వర్షాలు పడే అవకాశముందని పేర్కొంది. పలు జిల్లాలకు ఇప్పటికే ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. ఈ నెల 13న పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశముందని, దీని ప్రభావంతో ఆగస్టు 13, 14, 15, 16 తేదీల్లో రాష్ట్రంలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం తెలిపింది.

## బనకచర్లను అడ్డుకుంటాం




ఈ కబురు, మహబూబాబాద్, మధిర, మధిర గ్రామీణం, న్యూస్‌టుడే: తెలంగాణకు నష్టం కల్గించే బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకొని తీరుతామని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. రాయలసీమ ఎత్తిపోతల పథకం నిర్మాణాన్ని నిలిపివేయాలని ఏపీ ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్ ఫిర్యాదుతో బనకచర్ల ప్రాజెక్టు అనుమతులు నిలిచిపోయాయని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. గోదావరిపై తుమ్మిడిహెట్టి వద్ద అంబేడ్కర్ సుజల స్రవంతి ప్రాజెక్టును కట్టి తీరుతామని.. పనులు ప్రారంభించబోతున్నామన్నారు. ములుగు జిల్లా తుపాకులగూడెం వద్ద నిర్మించిన సమ్మక్క సాగర్ బ్యారేజీ, దేవాదుల ప్రాజెక్టును ఆదివారం వారు సందర్శించి సమీక్షించారు. అంతకుముందు ఖమ్మం జిల్లా మధిర మండలం వంగవీడు గ్రామ సమీపంలోని వైరా నదిపై రూ.630 కోట్లతో నిర్మించనున్న జవహర్ ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేసి బహిరంగ సభలో మాట్లాడారు. రాయలసీమ ఎత్తిపోతల ద్వారా ఏపీ ప్రభుత్వం రోజుకు 11 టీఎంసీల నీటిని ఆంధ్రాకు తరలిస్తే 25 రోజుల్లో శ్రీశైలం జలాశయం ఖాళీ అవుతుందని, దీనివల్ల నల్గొండ, ఖమ్మం జిల్లాల రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. భద్రాచలం డివిజన్‌లోని గిరిజనులు నివసించే ఏడు మండలాలను పక్కకు పెట్టాలని నాడు సోనియాగాంధీకి విజ్ఞప్తి చేయగా పునర్విభజన చట్టంలోంచి ఆ ఏడు మండలాలను మినహాయించారని ఉప ముఖ్యమంత్రి వివరించారు. తర్వాత కేంద్రంలో అధికారంలోకి వచ్చిన భాజపా రాష్ట్రంలో భారత రాష్ట్ర సమితి తో కలిసి దొంగచాటుగా ఆర్డినెన్స్ తెచ్చాయని... గిరిజనుల రెండు లక్షల ఎకరాలను పోలవరానికి ధారాదత్తం చేశారని భట్టి ఆరోపించారు. నాటి భారత రాష్ట్ర సమితి ప్రభుత్వ నిర్లక్ష్యం, అవినీతి వల్లే కాళేశ్వరం ప్రాజెక్టు కుంగిపోయిందని జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదిక ఇచ్చిందని.. ఆ పార్టీ నాయకులు దీన్ని వక్రీకరించి న్యాయవ్యవస్థను అవమానపరిచేలా మాట్లాడుతున్నారని మంత్రి ఉత్తమ్ అన్నారు.

**దేవాదులపై త్వరలో ఉన్నతస్థాయి సమీక్ష**

దేవాదుల ప్రాజెక్టు మూడో ఫేజ్‌లో పనులు చేపట్టాల్సి ఉందని.. 2800 ఎకరాలు సేకరించాలని..రూ.67 కోట్ల పరిహారం, రూ.179 కోట్ల బిల్లుల బకాయిలున్నట్లు అధికారులు మంత్రుల దృష్టి తెచ్చారు. అసంపూర్తి పనుల గురించి ఎమ్మెల్యేలు ప్రస్తావించగా.. వాటిపై మూడు రోజుల్లో నివేదికలు ఇవ్వాలని.. పది రోజుల్లో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహిద్దామన్నారు. దేవాదుల పనులు పూర్తి చేయటానికి తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. బిల్లుల విడుదలపై మంత్రులు హామీ ఇచ్చారు. ప్రారంభ సమయంలో దేవాదుల 38.16 టీఎంసీలతో 5.57 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ లక్ష్యంగా పెట్టుకున్నామని.. కానీ పది జిల్లాల్లోని 17 నియోజకవర్గాల్లో పది లక్షలకు పైగా ఎకరాల ఆయకట్టుకు నీళ్లివ్వాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. ఈ క్రమంలో నీటి కేటాయింపులు 38.16 టీఎంసీల నుంచి 7580 టీఎంసీలకు పెరగాల్సి ఉందన్నారు. ఈ మేరకు సీడబ్ల్యూసీకి నివేదించామన్నారు. సమ్మక్కసాగర్ బ్యారేజీ నుంచి నీటిని తీసుకునేలా అనుమతులు పొందాల్సి ఉందన్నారు. ఇచ్చంపల్లి పూర్తికి నిధులివ్వాలని.. గోదావరికావేరి నదుల అనుసంధానానికి సహకరించాలని కేంద్రాన్ని కోరినట్లు, దీనిని సాధించే దిశగా ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, ఎంపీ పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణరావు, దొంతుమాధవరెడ్డి, మురళీనాయక్, రాందాస్‌నాయక్, మట్టా రాగమయి, పలు కార్పొరేషన్ల ఛైర్మన్లు, అధికారులు పాల్గొన్నారు.

## ఒకే మహిళ రెండుసార్లు ఓటు' ఆరోపణలు.. రాహుల్ గాంధీకి నోటీసులు




ఈ కబురు, ఓ మహిళా ఓటరు రెండుసార్లు ఓటేశారంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఇటీవల ఆరోపించిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంలో ఆయనకు కర్ణాటక చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ నోటీసులు జారీ చేశారు. ఆ ఆరోపణలపై పూర్తిస్థాయి విచారణ జరిపేందుకుగానూ సంబంధిత పత్రాలను సమర్పించాలని సూచించారు. మరోవైపు.. ఎన్నికల సంఘం కూడా ఓట్ల చోరీ ఆరోపణలపై డిక్లరేషన్ సమర్పించాలని, లేదా తప్పుడు ఆరోపణలకు దేశానికి క్షమాపణ చెప్పాలని మరోసారి కోరింది. ''ఇటీవల ప్రజెంటేషన్‌లో చూపిన పత్రాలు.. ఎన్నికల కమిషన్ రికార్డుల నుంచి సేకరించినట్లు రాహుల్ గాంధీ చెప్పారు. అదేవిధంగా.. పోలింగ్ అధికారి ఇచ్చిన రికార్డుల ప్రకారం శకున్ రాణి అనే మహిళ రెండుసార్లు ఓటు వేశారని ఆరోపించారు. అయితే.. మా విచారణలో ఆమె ఒక్కసారే ఓటు వేశానని చెప్పారు. ఆమె రెండుసార్లు ఓటేశారంటూ ప్రజెంటేషన్‌లో చూపిన టిక్ మార్క్ పత్రాలు కూడా పోలింగ్ అధికారి జారీ చేసినవి కావని వెల్లడైంది. కాబట్టి, ఆరోపణలకు సంబంధించిన పత్రాలను అందించండి. తద్వారా ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టొచ్చు'' అని రాహుల్ గాంధీకి జారీ చేసిన నోటీసులో కర్ణాటక సీఈవో పేర్కొన్నారు. ఓట్ల చోరీ వ్యవహారంపై రాహుల్ గాంధీ ఆదివారం మరోసారి ధ్వజమెత్తారు. 'ఒక వ్యక్తి ఒకే ఓటు' అనే ప్రజాస్వామ్య సూత్రంపై దాడిగా దీన్ని పేర్కొన్నారు. స్వేచ్ఛాయుత, నిష్పాక్షపాత ఎన్నికల నిర్వహణకు సరైన ఓటర్ల జాబితా తప్పనిసరి అని ట్వీట్ చేశారు. ప్రజలు, పార్టీలు ఆ జాబితాలను పరిశీలించేందుకు వీలుగా డిజిటల్ ఓటరు జాబితాలను విడుదల చేయాలని ఈసీని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకే ఈ పోరాటం చేస్తున్నట్లు తెలిపారు.

**ఆపరేషన్ సిందూర్ విజయం వెనుక.. 'మేక్ ఇన్ ఇండియా': ప్రధాని మోదీ**

అయితే, రాహుల్ వ్యాఖ్యలను ఎన్నికల సంఘం కొట్టిపారేసింది. ప్రతి ఎన్నికలకు ముందు ఓటర్లకు సంబంధించిన ముసాయిదా, తుది జాబితాల డిజిటల్, ఫిజికల్ కాపీలను రాజకీయ పార్టీలకు అందజేస్తూనే ఉంటామని స్పష్టం చేసింది. పార్టీలకు ఓటర్ల జాబితా డిజిటల్ కాపీలను ఇవ్వరనే వాదనను అవాస్తవంగా, తప్పుదోవ పట్టించేదిగా ఈసీ పేర్కొంది.

## మరో మార్గం లేదు - 'గాజా ఆక్రమణ'పై నెతన్యాహు



ఈ కబురు, ఇజ్రాయెల్ నిర్దేశించుకున్న లక్ష్యాన్ని పూర్తి చేయడం తప్పితే మరో మార్గం లేదని ఆ దేశ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు పేర్కొన్నారు. హమాస్‌ను అంతం చేసే ప్రక్రియను పూర్తిచేయడమే తమ లక్ష్యమన్నారు. జెరూసలెంలో విదేశీ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ.. గాజాపై సైనిక చర్య ప్రణాళికను సమర్థించుకున్నారు. తదుపరి చర్యల కోసం చాలా తక్కువ సమయం ఉందన్నారు.గాజాను ఆక్రమించడం తమ లక్ష్యం కాదని, దానికి స్వేచ్ఛ కల్పించడమే తమ లక్ష్యమని నెతన్యాహు మరోసారి స్పష్టం చేశారు. తమ చర్యలను ఖండిస్తూ స్థానికంగా, ఇజ్రాయెల్ బయట జరుగుతున్నది తప్పుడు ప్రచారమేనని అభిప్రాయపడ్డారు. గాజాను సైనిక రహితంగా మార్చడం, అక్కడి భద్రతను ఇజ్రాయెల్ సైన్యం తమ నియంత్రణలోకి తీసుకోవడం వంటివి తమ ఉద్దేశమన్నారు.

పాక్ ఆర్మీ చీఫ్ అమెరికాలో పర్యటన... రెండు నెలల్లో రెండోసారి

హమాస్ చర్యలే గాజా పౌరుల మరణాలు, నగరాల నాశనం, మానవతా సాయం అందకపోవడం వంటి సమస్యలకు కారణమని నెతన్యాహు మరోసారి ఆరోపించారు. ఇదిలాఉంటే, గాజా సిటీ స్వాధీనానికి ఇజ్రాయెల్ భద్రతా క్యాబినెట్ ఇటీవల ఆమోదం తెలపడంపై స్థానికంగా, అంతర్జాతీయంగా తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఐక్యరాజ్యసమితి సహా చాలా దేశాలు ఈ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండించాయి. ఈ నేపథ్యంలోనే నెతన్యాహు స్పందిస్తూ.. మరో మార్గం లేదని చెప్పారు.

## పాక్ ఆర్మీ చీఫ్ అమెరికాలో పర్యటన... రెండు నెలల్లో రెండోసారి



ఈ కబురు, పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ అమెరికాలో పర్యటించారు. అక్కడి రాజకీయ, సైనిక ఉన్నతాధికారులతోపాటు ప్రవాస పాకిస్థానీలతోనూ భేటీ అయ్యారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత ట్రంప్ విందులో పాల్గొన్న మునీర్.. రెండు నెలల వ్యవధిలోనే మరోసారి అక్కడ పర్యటించారు. ముఖ్యంగా భారత్‌పై అధ్యక్షుడు ట్రంప్ సుంకాల భారం మోపుతున్న వేళ తాజా పరిణామం చోటుచేసుకుంది.చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ అమెరికాలో అధికారిక పర్యటన చేస్తున్నట్లు పాక్ ఆర్మీ ఓ ప్రకటన చేసింది. అయితే, ఆయన ఎప్పుడు చేరుకున్నారు? ఎన్ని రోజులు ఉంటారనే విషయాలను వెల్లడించలేదు. యూఎస్ సెంట్రల్ కమాండ్ కమాండర్ జనరల్ మైఖేల్ ఈ. కురిల్లా పదవీ విరమణ కార్యక్రమంలో మునీర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ద్వైపాక్షిక సైనిక సహకారంలో కురిల్లా నాయకత్వం ఎంతగానో దోహదపడిందన్నారు. ఈ సందర్భంగా యూఎస్‌కు చెందిన ఇతర సైనికాధికారులతో మునీర్ భేటీ అయ్యారు. పాక్ ప్రవాసులతో ముచ్చటించిన మునీర్, పాక్‌కు మంచి భవిష్యత్తు ఉందని, పెట్టుబడులు తేవడంలో సహకరించాలని చెప్పారు.

**అమెరికాలో పాక్ ఆర్మీ చీఫ్‌కు భంగపాటు**

పాక్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ జూన్‌లోనూ అమెరికాలో పర్యటించారు. ఐదు రోజుల పర్యటనలో భాగంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తోనూ విందు చేశారు. ఓ ఆర్మీ చీఫ్‌కు అమెరికా అధ్యక్షుడు విందు ఇవ్వడం అత్యంత అరుదు. అప్పట్లో భారత్ అభ్యంతరాల్ని బేఖాతరు చేస్తూ జరిగిన ఆ సమావేశంలో ఇరు దేశాలు వివిధ రంగాల్లో సహకారాన్ని పెంపొందించుకోవాలని నిర్ణయించినట్లు తెలిసింది.


## గొప్ప సంస్కరణవాది శివశంకర్



ఈ కబురు, చిత్తశుద్ధితో కృషిచేస్తే పేదరికం, వెనుకబాటుతనం అడ్డుకాదని నిరూపించి, స్వయంకృషితో ఉన్నత శిఖరాలు చేరుకున్న స్ఫూర్తిప్రదాత పుంజాల శివశంకర్ అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఆయన గొప్ప సంస్కరణవాది అని పేర్కొన్నారు. ఆదివారం రాత్రి హైదరాబాద్ రవీంద్రభారతిలో కేంద్ర మాజీ మంత్రి శివశంకర్ 96వ జయంత్యుత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శివశంకర్ కుమారుడు డాక్టర్ వినయ్ అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్యఅతిథిగా భట్టి మాట్లాడారు.. నగరంలోని ఒక గౌరవప్రదమైన చోట శివశంకర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసే అంశాన్ని ముఖ్యమంత్రితో మాట్లాడి, త్వరలోనే ప్రకటిస్తామన్నారు. హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ.. శివశంకర్ పుణ్యమా అని జస్టిస్ రామస్వామి వంటి ఎంతోమంది బలహీనవర్గాలవారు హైకోర్టు న్యాయమూర్తులయ్యారని అన్నారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరిలు మాట్లాడుతూ..శివశంకర్‌లాంటి పెద్దలు కోరుకున్న కల బీసీ రిజర్వేషన్లని.. రాహుల్‌గాంధీ చేయూతతో దేశంలో ఓబీసీల వాటా కోసం ఉద్యమాలు జరుగుతున్నాయన్నారు. నవతరానికి శివశంకర్ జీవితాన్ని పరిచయం చేయాలన్నారు. ప్రభుత్వ సలహాదారు కేశవరావు, మాజీ

## బాస్ అనుకునేవాళ్లకు భారత్ వృద్ధి నచ్చలేదు

రాయ్‌సేన్: భారత ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలోనే అత్యంత చురుగ్గా, క్రియాశీలంగా ఉందని, ఇది 'తామే అందరికీ బాస్'లము అనుకునేవాళ్లకు నచ్చట్లేదని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. భారత్ నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధిక సుంకాలను ప్రకటించిన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఆదివారం ఆయన మధ్యప్రదేశ్‌లోని రాయ్‌సేన్ జిల్లాలో ఓ రైలు తయారీ సంస్థ భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భారత్ వేగంగా అభివృద్ధి చెందడాన్ని కొన్ని దేశాల అధినేతలు చూడలేకపోతున్నారని అన్నారు. తమతో సమానంగా భారత్ మారకూడదనే అహంకారంతో.. దేశాభివృద్ధిని కుంటుపడేలా చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా దేశాభివృద్ధిని ఎవరూ ఆపలేరని ఉద్ఘాటించారు. భారత్ అతిత్వరలోనే మూడో అతిపెద్ద ఆర్థికశక్తిగా మారనుందని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. అందువల్ల ఇప్పుడు మన ఆర్థిక ప్రయోజనాలపై మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని.. ఇందుకోసం మోదీ ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటోందని అన్నారు. మన దేశాన్ని తయారీ, ఆవిష్కరణల శక్తి కేంద్రంగా మార్చాలనే ఉద్దేశంతో తీసుకువచ్చిన 'మేకిన్ ఇండియా' వల్ల వివిధ రంగాల్లో స్వదేశీ ఉత్పత్తులు పెరుగుతున్నాయని తెలిపారు.



# ఎస్‌బీఐ నుంచి స్టాక్ మార్కెట్‌కు 2 సంస్థలు

**జనరల్ ఇన్సూరెన్స్, మ్యూచువల్ ఫండ్ల లిస్టింగ్‌కు యోచన**

**ఎస్‌బీఐ గ్రూప్ చైర్మన్ సీఎస్ శెట్టి వెల్లడి**

**తెలుగు రాష్ట్రాల్లో 30 ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ శాఖలు ప్రారంభం**




**హైదరాబాద్:** ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) రెండు అనుబంధ సంస్థల పబ్లిక్ ఇష్యూపై కసరత్తు చేస్తోందని ఎస్‌బీఐ గ్రూప్ చైర్మన్ చల్లా శ్రీనివాసులు (సీఎస్) శెట్టి తెలిపారు. ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్, ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్ వీటిలో ఉన్నాయని చెప్పారు. స్టాక్ మార్కెట్‌లో లిస్టింగ్‌కు సంబంధించి నిర్దిష్ట గడువేదీ నిర్దేశించుకోలేదని పేర్కొన్నారు.

గ్రూప్‌లో ప్రస్తుతం 18 అనుబంధ సంస్థలు ఉన్నాయని, వీటిపై సుమారు రూ.6,500 కోట్లు ఇన్వెస్ట్ చేయగా, వాటి విలువ ప్రస్తుతం రూ.4 లక్షల కోట్ల పైచిలుకు ఉంటుందని వివరించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని అనకాపల్లి, ఖమ్మం తదితర ప్రాంతాల్లో ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్‌కు సంబంధించిన 30 హెల్త్ ఇన్సూరెన్స్ శాఖలను శనివారం ఆయన వర్చువల్‌గా ప్రారంభించారు. ఇవి ప్రత్యేకంగా ఆరోగ్య బీమా సర్వీసులను అందించేందుకే ఉద్దేశించినవని శ్రీనివాసులు శెట్టి తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో 2,100 పైగా ఆస్పత్రుల నెట్‌వర్క్‌తో సేవలు అందిస్తున్నట్లు ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ ఎండీ నవీన్ చంద్ర ఝా చెప్పారు.

**టారిఫ్‌ల అనిశ్చితి తొలగిపోతే మంచిది..**

భారత్‌పై అమెరికా టారిఫ్‌ల వల్ల ప్రత్యక్షంగా పడే ప్రభావం తక్కువే అయినప్పటికీ, వాటి వల్ల తలెత్తిన అనిశ్చితి సాధ్యమైనంత త్వరగా తొలగిపోతే మంచిదని శ్రీనివాసులు శెట్టి అభిప్రాయపడ్డారు. అమెరికాకు ఎక్కువగా ఎగుమతయ్యే రసాయనాలు, టెక్స్‌టైల్స్, ఆభరణాలు, తెలుగు రాష్ట్రాల నుంచి ఆక్వా తదితర రంగాలకు టారిఫ్‌ల వల్ల సవాళ్లు తలెత్తవచ్చని చెప్పారు. అయితే, టారిఫ్‌ల ప్రభావిత రంగాలకు రుణాలు స్వల్ప స్థాయిలోనే ఉన్నందున తమ బ్యాంకుపై ప్రభావం పెద్దగా ఉండదని తెలిపారు.



## రూ.1.12 లక్షల కొత్త హార్నెట్ బైక్

హోండా మోటార్‌సైకిల్ ఇండియా దేశీయ మార్కెట్లో 'సీబీ 125' హార్నెట్ లాంచ్ చేసింది. కంపెనీ లాంచ్ చేసిన ఈ బైక్ ధర రూ. 1.12 లక్షలు (ఎక్స్ షోరూం).
అప్డేటెడ్ డిజైన్ కలిగిన హోండా సీబీ 125 హార్నెట్ బైక్.. 123.94 సీసీ, సింగిల్ సిలిండర్ ఇంజిన్‌తో 10.99 bhp పవర్, 11.2 న్యూటన్ మీటర్ టార్క్ అందిస్తుంది. ఇది 5 స్పీడ్ గేర్‌బాక్స్‌తో లభిస్తుంది. ఈ బైక్ కొత్త స్టీల్ ఫ్రేమ్ ఛాసిస్ మీద నిర్మితమై ఉంది. ట్యూబ్‌లెస్ టైర్లను కలిగిన సీబీ 125 హార్నెట్ 17 ఇంచెస్ అల్లాయ్ వీల్స్‌పై నడుస్తుంది. ఈ బైక్ ముందు భాగంలో 240 మిమీ పెటల్ డిస్క్, వెనుక భాగంలో 130 మిమీ డిస్క్ బ్రేక్ ఉన్నాయి. అదనపు భద్రత కోసం సింగిల్ ఛానల్ ఏబీఎస్ కూడా ఉంటుంది. బ్లూటూత్ కనెక్టివిటీ, టర్న్‌బై టర్న్ నావిగేషన్‌ను అందించే 4.2 ఇంచెస్ TFT డిస్ప్లే ఈ బైకులో చూడవచ్చు. USBC ఛార్జింగ్ పోర్ట్ కూడా లభిస్తుంది.

# ట్రంప్ గ్రేట్ అంటున్న 'రిచ్ డాడ్ పూర్ డాడ్' కియోసాకి





అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గ్రేట్ అంటున్నారు 'రిచ్ డాడ్ పూర్ డాడ్' రచయిత, వ్యాపారవేత్త రాబర్ట్ కియోసాకి. క్రిప్టోకరెన్సీలో పెన్షన్ పొదుపు చేసే అవకాశాన్ని కల్పించినందుకు ప్రశంసించారు. అమెరికన్లలో అత్యంత ప్రాచుర్యం పొందిన 401(కె) రిటైర్మెంట్ ప్లాన్ల బ్యాలెన్స్‌లలో ఉన్న నిధులను డిజిటల్ ఆస్తులలో పెట్టుబడి పెట్టడానికి అనుమతించే ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై ట్రంప్ ఇటీవల సంతకం చేశారు.

నేడు ఈ పొదుపు మొత్తం 12,5 ట్రిలియన్ డాలర్లుగా అంచనా వేస్తున్నారు.కాబట్టి వర్చువల్ కరెన్సీ మార్కెట్లోకి బిలియన్ డాలర్లు ప్రవహించవచ్చు. అయితే, డిజిటల్ ఆస్తుల యజమానులు ఇప్పుడే సంతోషించడం తొందరపాటు అవుతుంది. రిస్క్ లను తగ్గించడానికి, యూఎస్ నివాసితుల ప్రయోజనాలను రక్షించడానికి పెన్షన్ పొదుపును ఖర్చు చేయడానికి ఫెడరల్ ప్రభుత్వం కొన్ని నిబంధనలను రూపొందించిన తరువాత మాత్రమే ఈ చట్టం ఆచరణలోకి వస్తుంది. క్రిప్టోకరెన్సీల్లోనే కాకుండా రియల్ ఎస్టేట్, విలువైన లోహాలు వంటి ఇతర ప్రత్యామ్నాయ ఆస్తుల్లో కూడా పొదుపు చేసే హక్కును రెగ్యులేటరీ చట్టం కల్పించడం గమనార్హం. అందువల్ల వర్చువల్ కరెన్సీల్లో ఎంత డబ్బు ఇన్వెస్ట్ చేస్తారో తెలియదు.

డోనాల్డ్ ట్రంప్‌కు తన ఆమోదాన్ని తెలియజేస్తూ రాబర్ట్ కియోసాకి 'ఎక్స్'(ట్విటర్)లో ఇలా పోస్ట్ చేశారు.. 'బిట్ కాయిన్ కొనుగోలుకు ప్రజలు తమ రిటైర్మెంట్ పొదుపును ఖర్చు చేయడానికి ట్రంప్ అనుమతించడం గొప్ప వార్త. గొప్ప అధ్యక్షుడు, గొప్ప నాయకుడు. మీరు బిట్ కాయిన్ సేవ్ చేస్తున్నారా?' అంటూ రాసుకొచ్చారు.



## పెరుగుతున్న బంగారం ధరలు: ప్రధాన కారణాలు

బంగారం ధరలు గత కొంత కాలంగా పెరుగుతూనే ఉన్నాయి. ఈ మధ్య కాలంలో గోల్డ్ రేటు మరింత పెరిగి పసిడి ప్రియులను అవాక్కయ్యాలా చేసింది. ఈ స్థాయిలో కనకం ధరలు పెరగడానికి కారణం ఏమిటనే వివరాలు ఈ కథనంలో వివరంగా తెలుసుకుందాం.

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరింత పెంచిన సుంకాలు చాలామంది పెట్టుబడిదారుల్లో భయాన్ని రేకెత్తించింది. స్టాక్ మార్కెట్లు కుప్ప కూలుతుంటే.. బంగారం రేటు మాత్రం ఆకాశాన్నంటుతోంది. దీనికి ప్రధాన కారణం పెట్టుబడిదారులు.. గోల్డ్ మీద ఎక్కువగా ఇన్వెస్ట్ చేయడమే అని నిపుణులు భావిస్తున్నారు.

2025 ఆగస్టు 01న గరిష్టంగా రూ. 210 తగ్గి రూ.99,820 (10 గ్రా 24 క్యారెట్స్) వద్ద నిలిచిన గోల్డ్ రేటు.. ఆ తరువాత ఆగస్టు 08 నాటికి రూ. 1,03,310 కు చేరింది. దీన్నిబట్టి చూస్తే పసిడి ధర ఈ మధ్య కాలంలోనే రూ. 3490 పెరిగింది. ఇది బంగారం ధరలు ఏ స్థాయిలో పెరుగుతున్నాయి తెలుపడానికి నిదర్శనం.

బంగారు కడ్డీలపై అమెరికా సుంకాలు, బలహీనమైన అమెరికా డాలర్, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేటు తగ్గింపుపై మార్కెట్ అంచనాలు, ఆర్థిక అనిశ్చితి మధ్య పెరుగుతున్న ప్రపంచ డిమాండ్ వంటివన్నీ గోల్డ్ రేటు పెరగడానికి కారణమవుతున్నాయి.

అస్థిర ఆర్థిక పరిస్థితుల్లో బంగారం సురక్షితమైన ఆస్తి. కాబట్టి గోల్డ్ కొనుగోలు చేసే పెట్టుబడిదారుల సంఖ్య కూడా పెరిగింది. ఓ వైపు శ్రావణమాసం.. మరోవైపు వస్తున్న పండుగ సీజన్. ఇవన్నీ కూడా బంగారం ధరలను మరింత పెంచే అవకాశం ఉంది. 2005లో రూ. 7000 వద్ద ఉన్న గోల్డ్ రేటు.. 2025లో రూ. 100000 దాటేసింది. దీన్నిబట్టి చూస్తే దశాబ్దంలో రేటు ఎంతలా పెరిగిందో అర్థం చేసుకోవచ్చు.

# 'అలాంటి ఒక్క వాహనం చూపించండి': గడ్కరీ ఓపెన్ ఛాలెంజ్



**పెట్రోల్‌లో ఇథనాల్ కలపడం వల్ల వాహనాల మైలేజ్ తగ్గుతుందనే వాదనలు నిజం కాదని, రోడ్డు రవాణా మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. మైలేజీపై E20 పెట్రోల్ ప్రభావం అనే ప్రశ్నకు సమాధానంగా ఇచ్చారు.**

''ప్రపంచంలో ఎక్కడైనా E20 పెట్రోల్ కారణంగా సమస్యలు ఎదుర్కొన్న ఒక వాహనాన్ని మీరు నాకు చూపించండి'' అని బహిరంగంగా సవాలు విసిరారు. ఇంధనం కారణంగా ఇంజిన్‌కు పెద్దగా నష్టం జరగదు. అయితే కొత్త కార్లలో మైలేజ్ 2 శాతం, అప్‌గ్రేడ్ చేసిన విడి భాగాలను ఉపయోగించిన కార్ల మైలేజ్ 6 శాతం తగ్గే అవకాశం ఉంది. ఇది సర్వ సాధారణం అని చెప్పవచ్చు. దీనిని సమస్యగా పరిగణించలేము.

స్థానికంగా ఉత్పత్తి చేసిన ఇథనాల్ వాడకం వల్ల, భారతదేశానికి పెట్రోల్ దిగుమతి ఖర్చు తగ్గుతుంది. అంతే కాకుండా ఈ ఇంధనం కాలుష్యాన్ని కూడా తగ్గిస్తుందని గడ్కరీ పేర్కొన్నారు. క్వింటాల్ మొక్కజొన్న ధర రూ.1,200 నుంచి రూ.2,600 ఉంటుంది. దీని నుంచి ఇథనాల్ తయారు చేస్తారు. కాబట్టి ఇంధన ధరలు కొంత తగ్గుతాయని అన్నారు.
ఇథనాల్ వినియోగం పెరగడం వల్ల.. బీహార్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాల్లో మొక్కజొన్న విస్తీర్ణం మూడు రెట్లు పెరిగింది. దీనివల్ల రైతుల ఆదాయం కూడా పెరుగుతుందని నితిన్ గడ్కరీ అన్నారు. ఈ విధంగా వైవిధ్యపరచడం వల్ల జీడీపీలో వ్యవసాయ వాటా ప్రస్తుత 12 శాతం నుండి 22 శాతానికి పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో 'ఇథనాల్'ను 100 శాతం ఇంధనంగా ఉపయోగించనున్నట్లు ప్రకటించారు.

## భారత్‌లో టెస్లా బిగ్ డీల్!.. నెలకు రూ.17.22 లక్షల రెంట్

**ప్రపంచం కుబేరుడు 'ఎలాన్ మస్క్' యాజమాన్యంలోని ఎలక్ట్రిక్ వాహన దిగ్గజం 'టెస్లా'.. ముంబైలో తన మొదటి షోరూమ్ ప్రారంభించింది. ఇప్పుడు తన రెండో షోరూంను ప్రారంభించడానికి సిద్ధమవుతోంది.**


తన రెండో షోరూమ్ కోసం టెస్లా ఇండియా మోటార్స్ అండ్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ ఢిల్లీలోని ఏరోసిటీలో 8,200 చదరపు అడుగుల స్థలాన్ని తొమ్మిది సంవత్సరాలకు లీజుకు తీసుకుంది. దీని నెలవారీ అద్దె రూ. 17.22 లక్షలు. ఈ విషయాన్ని డాక్యుమెంట్స్‌ను అసెస్ చేసిన 'సీఆర్ఈ మ్యాట్రిక్స్' వెల్లడించింది.

టెస్లా ఈ స్థలాన్ని ఓక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ నుంచి చదరపు అడుగుకు రూ. 210 చొప్పున.. రూ.1.03 కోట్ల సెక్యూరిటీ డిపాజిట్‌తో లీజుకు తీసుకుంది. అంతే కాకుండా టెస్లా నెలకు రూ. 6,000 చొప్పున 10 పార్కింగ్ స్లాట్‌లను కూడా తీసుకున్నట్లు తెలుస్తోంది.

జూలై 15, 2025న ప్రారంభమయ్యే లీజు మొదటి సంవత్సరానికి రూ. 40.17 లక్షలు, రెండవ సంవత్సరంలో రూ. 42.07 లక్షలు, మూడవ సంవత్సరంలో రూ. 44.07 లక్షలు, నాల్గవ సంవత్సరంలో రూ. 46.17 లక్షలు, ఐదవ సంవత్సరంలో రూ. 48.36 లక్షలు, ఆరవ సంవత్సరంలో రూ. 50.66 లక్షలు, ఏడవ సంవత్సరంలో రూ. 53.06 లక్షలు, ఎనిమిదవ సంవత్సరంలో రూ. 55.58 లక్షలు, తొమ్మిదవ సంవత్సరంలో రూ. 58.22 లక్షలకు చేరుకుంటుంది.



# నవంబరులో ముహూర్తం



మహేశ్‌బాబు ఎస్.ఎస్.రాజమౌళి కలయికలో రూపొందుతున్న సినిమాపై ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల్లో ఆసక్తి వ్యక్తం అవుతోంది. శనివారం మహేశ్‌బాబు పుట్టినరోజు సందర్భంగా ఓ కీలకమైన విషయాన్ని పంచుకున్నారు దర్శకుడు రాజమౌళి. ఈ సినిమా ఫస్ట్ లుక్‌ని నవంబరులో విడుదల చేయనున్నట్టు ఆయన ఎక్స్ ద్వారా వెల్లడించారు. చాలా రోజుల కిందటే మొదలైన ఈ చిత్రానికి సంబంధించి ఇప్పటివరకూ ఎలాంటి విషయాలు బయటికి రాలేదు. మహేశ్ అభిమానులు, ప్రేక్షకులు సామాజిక మాధ్యమాల్లో ఎప్పటికప్పుడు అప్‌డేట్స్ గురించి ఆరా తీస్తూనే ఉన్నారు. వాళ్లందరిలోనూ సంతోషాన్ని నింపేలా శనివారం ఓ ప్రీ లుక్‌ని పంచుకుంటూ, నవంబరులో ఇదివరకెప్పుడూ చూడని విధంగా లుక్‌ని విడుదల చేస్తామని రాజమౌళి తెలిపారు. ప్రీ లుక్‌లో మెడలో వేలాడుతున్న త్రిశూలంతోపాటు, శివుడి ఇతర చిహ్నాలున్న దండ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

''మేం చిత్రీకరణ ప్రారంభించి కొంతకాలం అయ్యింది. ఈ చిత్రం గురించి తెలుసుకోవాలని ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రేమికులు, మహేశ్‌బాబు అభిమానులు ఆసక్తి కనబరుస్తున్నారు. అందుకు ఎంతో ఆనందంగా ఉంది. అయితే ఈ చిత్ర కథ, దాని పరిధి ఎంతో విస్తృతమైనది. విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి, కొన్ని చిత్రాల్ని పంచుకున్నంత మాత్రాన న్యాయం జరగదని నేను భావిస్తున్నా. ఈ సినిమా ప్రపంచాన్ని, దాని లోతైన భావాన్ని సృష్టించే ప్రయత్నంలోనే ప్రస్తుతం మేమంతా ఉన్నాం. ఆ ప్రపంచాన్ని నవంబరులో ఆవిష్కరిస్తాం. అది ఇదివరకెప్పుడూ చూడని విధంగా ఉంటుంది. మీ అందరి ఓపికకి నా కృతజ్ఞతలు'' అంటూ రాజమౌళి ఎక్స్‌లో పంచుకున్న పోస్ట్‌లో వెల్లడించారు.

గ్లోబ్ ట్రాటర్... అనే ఉపశీర్షికతో ఈ చిత్రం రూపొందుతోంది. ప్రపంచాన్ని చుట్టేసే ఓ సాహసికుడిగా మహేశ్‌బాబు ఇందులో కనిపించనున్నట్టు తెలుస్తోంది. ఆయన సరసన ప్రియాంక చోప్రా నటిస్తుండగా, పృథ్వీరాజ్ సుకుమారన్ ఓ కీలక పాత్రని పోషిస్తున్నారు. కె.ఎల్.నారాయణ నిర్మిస్తున్నారు. ఎం.ఎం.కీరవాణి స్వరాలు సమకూరుస్తున్నారు.




# అభిమానులకి శిరస్సు వంచి నమస్కరించిన తారక్

**టాలీవుడ్ హీరో ఎన్టీఆర్ చేసిన తొలి హిందీ సినిమా 'వార్ 2'. ఇప్పటికే ట్రైలర్, తదితర ప్రమోషనల్ కంటెంట్ రాగా కాస్త హైప్ పెరిగింది. తాజాగా హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. దీనికి హృతిక్ రోషన్, దర్శకుడు అయాన్ ముఖర్జీతో పాటు త్రివిక్రమ్,దిల్ రాజు తదితరులు హాజరయ్యారు. ఈ వేడుకలో మాట్లాడిన ఎన్టీఆర్, మూవీ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. అలానే తనకంటే హృతిక్ గొప్ప డ్యాన్సర్ అని పొగిడేశాడు. ఇంకా ఏమేం చెప్పాడంటే?**



'వార్ 2 సినిమాలో నేను నటించడానికి ముఖ్య కారణం ఆదిత్య చోప్రా గారు. నా వెంటపడి, నాకు భరోసా కల్పించి.. నీ అభిమానులు గర్వపడి తలెత్తుకునేలా చేస్తానని చెప్పారు. ఆదిత్య చోప్రా గారికి నా ధన్యవాదాలు. మా తాత నందమూరి తారక రామారావు ఆశీసులు ఉన్నంత కాలం నన్ను ఎవరు ఆపలేరు. అలానే నా కంటికి మైకేల్ జాక్సన్ తప్ప ఎవరు అనే వారు కాదు. కానీ హృతిక్ రోషన్‌ని చూసి మ్యాడ్ అయిపోయాను. దేశంలో బెస్ట్ డ్యాన్సర్ ఇతడే' అని తారక్ చెప్పుకొచ్చాడు.

''బాద్ షా' ఫంక్షన్ జరిగినప్పుడు ఒక అభిమాని ప్రాణం కోల్పోయాడు. ఆరోజు నుండి పబ్లిక్ ఈవెంట్స్‌కు దూరంగా ఉన్నాను. 'వార్ 2' నా బాలీవుడ్ డెబ్యూ మూవీ మాత్రమే కాదు. హృతిక్ రోషన్ టాలీవుడ్ డెబ్యూ కూడా. సౌత్, నార్త్ అనే హద్దులు చెరిపేసిన రాజమౌళికి పెద్ద థాంక్స్. ఇకపోతే ఎవరు ఎన్ని అనుకున్నా బొమ్మ అదిరిపోయింది. పండగ చేసుకోండి' అని ఎన్టీఆర్.. అభిమానుల్లో ఫుల్ జోష్ నింపాడు. చివరలో తారక్‌హృతిక్ తమ కాలర్లు ఎగరేసి సినిమాపై హైప్ పెంచేశారు.

ఆగస్టు 14న రాబోతున్న 'వార్ 2' సినిమా.. యష్ రాజ్ స్పై యూనివర్స్‌లో వస్తున్న లేటెస్ట్ మూవీ. ఎన్టీఆర్, హృతిక్ రోషన్ హీరోలు కాగా కియారా అడ్వాణీ హీరోయిన్. అయాన్ ముఖర్జీ దర్శకుడు. సితార ఎంటర్ టైన్‌మెంట్స్ నాగవంశీ.. తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. అదే రోజున రజినీకాంత్ 'కూలీ' కూడా రిలీజ్ అవుతోంది. మరి రెండు చిత్రాల్లో ఏది అభిమానుల్ని ఆకట్టుకుంటుందో చూడాలి?



# ఆ సినిమాకు రూ.1 లక్ష పారితోషికం ఇచ్చా.. నిర్మాత

హీరోల పారితోషికాలు ఆకాశన్నంటుతున్నాయి. మామూలు హీరోలు లక్షల్లో మీడియం హీరోలు కోట్లల్లో తీసుకుంటే స్టార్ హీరోలు పదులు, వందల కోట్లు డిమాండ్ చేస్తున్నారు. ఈ రెమ్యునరేషన్లకే సగం బడ్జెట్ కేటాయించాల్సి వస్తోందని బాధపడే నిర్మాతలున్నారు. ఎంతెక్కువైనా సరే కానీ, ఆయా హీరోలతో కలిసి పని చేయాల్సిందేనని అడిగినంత ఇచ్చేందుకు ముందుకొచ్చే నిర్మాతలూ ఉన్నారు. అయితే వీళ్లందరూ చాలా తక్కువ మొత్తం నుంచి కెరీర్ మొదలుపెట్టినవాళ్లే.. అందులో మలయాళ స్టార్, పుష్ప విలన్ ఫహద్ ఫాజిల్ ఒకరు.

**ఆ సినిమాకు రూ.1 లక్ష రెమ్యునరేషన్**

చాప్ప కురిష్ సినిమాకుగానూ ఫహద్ ఫాజిల్ కేవలం రూ.1 లక్ష మాత్రమే పారితోషికం తీసుకున్నాడు. ఈ విషయాన్ని నిర్మాత లిస్టిన్ స్టీఫెన్ వెల్లడించాడు. తాజాగా ఆయన ఓ ఈవెంట్‌లో మాట్లాడుతూ.. చప్ప కురిష్ తర్వాత ఫహద్, నేను మళ్లీ సినిమా చేయలేదు. 2011లో ఆ సినిమా వచ్చింది. మొదట అతడికి నేను డబ్బు ఇవ్వలేదు. సినిమా పూర్తయ్యాకే ఇచ్చాను. దానికంటే ముందు టోర్నమెంట్ మూవీకిగానూ రూ.65వేలు తీసుకున్నట్లు చెప్పాడు. నేను నా చిత్రానికి రూ.1 లక్ష ఇచ్చాను. ఇప్పుడు రూ.5-10 కోట్లు ఇచ్చినా ఫహద్ దొరకడు.

**సక్సెస్ రాలేదని వెనక్కువెళ్లిపోలేదు**

ఇప్పుడతడు పాన్ ఇండియా రేంజ్‌కు ఎదిగాడు. ప్రముఖ దర్శకుడు ఫాజిల్ కుమారుడిగా ఇండస్ట్రీలో అడుగుపెట్టిన అతడికి తొలినాళ్లలో అంత సక్సెస్ రాలేదు. దీంతో కొంతకాలం బ్రేక్ తీసుకుని తిరిగి ఇండస్ట్రీలో ఎంట్రీ ఇచ్చాడు. అంకితభావంతో సినిమాలు చేశాడు. తన టాలెంట్‌తో దూసుకుపోయాడు. ఓ ఇంటర్వ్యూలో ఫహద్ 'చప్ప కురిష్' తన బెస్ట్ సినిమాల్లో ఒకటని పేర్కొన్నాడు. ఆ క్లిప్పింగ్ భద్రంగా దాచుకున్నా.. సినిమాల్లోకి రావాలనుకునేవారు ఆయన్ను చూసి నేర్చుకోండి అని చెప్పకొచ్చాడు.










# 'కాగితం పడవలు' గ్లింప్స్ రిలీజ్

ఎంజీఆర్ తుకారాం దర్శకత్వంలో తీస్తున్న లవ్ స్టోరీకి 'కాగితం పడవలు' అనే టైటిల్ నిర్ణయించారు. కీర్తన నరేష్, ప్రసాద్ రెడ్డి వెంకట్రాజుల, గాయిత్రమ్మ అంజనప్ప నిర్మిస్తున్నారు. తాజాగా గ్లింప్స్ రిలీజ్ చేశారు. 'చాలా దూరం వెళ్ళిపోయావు గోదావరి. నిన్ను ఎక్కడ వదిలేశానో అక్కడే నిలబడి ఉన్నాను రామ్' అనే డైలాగ్ ఆకట్టుకునేలా ఉంది. తీరంలో ఓ జంట కలుసుకోవడం, విజువల్స్, నేపథ్య సంగీతం లాంటివి అలరిస్తున్నాయి.

దర్శకుడు ఎంజీఆర్ తుకారాం లవ్లీ ఎమోషన్స్, హృదయాన్ని తాకే కథ, అందమైన విజువల్స్‌తో ఈ చిత్రాన్ని మలిచినట్లు గ్లింప్స్ చూస్తే అర్థమవుతోంది. ఈ చిత్రానికి నౌఫల్ రాజా మ్యూజిక్ అందిస్తున్నారు. రుద్రసాయి & జానా డీవోపీగా పని చేస్తున్నారు. జెస్విన్ ప్రభు ఎడిటర్. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ఎం.హిమ బిందు. త్వరలోనే ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.

# వింధ్య, హిమాచల పర్వతాలు ఎన్టీఆర్, హృతిక్..: త్రివిక్రమ్

**హైదరాబాద్:** ఎన్టీఆర్, హృతిక్‌లు వింధ్య, హిమాచల పర్వతాల్లాంటి వారని, అలాంటి వారి సినిమా కచ్చితంగా ప్రతి ఒక్కరినీ అలరిస్తుందని దర్శకుడు త్రివిక్రమ్ అన్నారు. అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'వార్2'. కియారా అడ్వాణీ కథానాయిక. ఆగస్టు 14న ఈ సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీరిలీజ్ వేడుకకు విచ్చేసిన త్రివిక్రమ్ తనదైన శైలిలో మాట్లాడి అలరించారు.

''దేవర' విడుదలైనప్పుడు ఆ ఏడాది 'దేవరనామ' సంవత్సరమని చెప్పాను. ఇది హృతిక్‌రామారావు నామ సంవత్సరం. మెరుపు తీగల్లా ఉన్న ఇద్దరినీ ఒకే తెరపై చూడటానికి రెండు కళ్లూ చాలవు. ఇది కేవలం యాక్షన్ సినిమా మాత్రమే కాదు, అంతకు మించి ఉంటుందని దర్శకుడు అయాన్ చెబుతున్నారు. సాధారణ యాక్షన్ మూవీ అయితే, ఎన్టీఆర్ అవసరం లేదు. ఏ భావోద్వేగాన్నైనా పలికించగల నటుడు ఎన్టీఆర్. బంగారం ఉంటే నగ చేయించుకుంటారు కానీ, బీరువాలో పెట్టుకోరు కదా. ఎన్టీఆర్ కూడా బంగారంలాంటి వారే. ఏ నగ చేయాలో అయాన్‌కు తెలుసు. అందుకే ఎన్టీఆర్ కోసం ఇక్కడ దాకా వచ్చారు. ఎన్టీఆర్, హృతిక్‌లు వింధ్య, హిమాలయ పర్వతాలలాంటివారు. ఈసారి వినాయక చవితి సంబరాల్లో 'వార్2' పాట విన పడుతూనే ఉంటుంది. ఆగస్టు 14న విడుదలయ్యే 'వార్2' అందరినీ అలరిస్తుంది'' అని అన్నారు.

**అసలైన కథ తెరపైనే చూడండి: అయాన్ ముఖర్జీ**

ఇక ఈ మూవీ దర్శకుడు అయాన్ ముఖర్జీ మాట్లాడుతూ.. ''వార్2' లాంటి గొప్ప ప్రతిష్ఠాత్మక సినిమా చేయడం నా అదృష్టం. 'బ్రహ్మాస్త్ర'కు ఇక్కడ చీఫ్ గెస్ట్‌గా తారక్ రావాల్సి ఉంది. అప్పుడు కుదరలేదు. ఇప్పుడు ఆయనతోనే సినిమా చేశా. ఇదంతా డెస్టినీ. నా జీవితం ఒక సర్కిల్‌లా అనిపించింది. ఇప్పటి దాకా మీరు చూసిన ట్రైలర్, పాటలు, విజువల్స్‌కు మించి ఒక గొప్ప కథ ఉంది. అది ఇప్పటి వరకూ మీకు చెప్పలేదు. అది థియేటర్‌లో మిమ్మల్ని ఆశ్చర్యపరుస్తుంది. హృతిక్, తారక్‌లాంటి నటుల్ని కలిపి ఈ స్క్రిప్ట్‌లోకి తీసుకొచ్చి, వాళ్లను దర్శకత్వం చేయడమంటే పెద్ద బాధ్యత. దాన్ని నిర్వర్తించడానికి నేను, నా టీమ్ నిరంతరం శ్రమించాం. ఈ విజన్ అనుకున్నప్పటి నుంచి నేను ఒత్తిడిలోనే ఉన్నా. అందుకే అందరినీ అలరించేలా తీర్చిదిద్దడంపైనే ఎక్కువ దృష్టి పెట్టాను. 'వార్1'కు మించి 'వార్2' ఉంటుంది. ఇంతకుమించి నేను ఎక్కువ చెప్పను. అది మీరు తెరపై చూసి తెలుసుకోవాల్సిందే. 'ఎన్టీఆర్ ఇంటర్వెల్ సమయానికి వస్తారు' అని వార్తలు వస్తున్నాయి. అలా ఉంటే, ఈ సినిమా ఎందుకు తీస్తాం? నాకు నా విజ్ఞత ఉంది. ఎప్పుడు వస్తారనేది మీరు తెరపై చూసి తెలుసుకోండి'' అని అన్నారు.

# ఆసియాకప్ గెలిచేది ఆ జట్టే: సౌరవ్ గంగూలీ



ఆసియాకప్2025 సెప్టెంబర్ 9 నుంచి ప్రారంభం కానుంది. మొత్తం 8 జట్లు పాల్గోనే ఈ టోర్నీ దుబాయ్, అబుదాబి వేదికలగా జరగనుంది. ఈ మెగా ఈవెంట్ కోసం తమ ఆస్త్రశాస్త్రాలను ఆయా జట్లు సిద్దం చేసుకుంటున్నాయి. ఇప్పటికే అఫ్గానిస్తాన్, బంగ్లా క్రికెట్ బోర్డులు తమ ప్రిలిమిరీ జట్లను సైతం ప్రకటించాయి.

బీసీసీఐ కూడా భారత జట్టు ఆగస్టు మూడో వారంలో ప్రకటించనుంది. కాగా భారత క్రికెట్ జట్టు ఈ ఏడాది ఆరంభంలో ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్ తర్వాత పొట్టి ఫార్మాట్‌లో ఆడడం ఇదే తొలిసారి. దాదాపు ఎనిమిది నెలల తర్వాత టీ20 సిరీస్ ఆడుతున్నప్పటికి సూర్య అండ్ కోపై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆసియాకప్ విజేతగా టీమిండియా నిలుస్తుందని భారత మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ జోస్యం చెప్పాడు.

భారత క్రికెట్ జట్టుకు టీ20 ఫార్మాట్‌లో సుదీర్ఘమైన విరామం లభించింది. ఐపీఎల్ తర్వాత ఐదు టెస్టు మ్యాచ్‌ల సిరీస్ కోసం ఇంగ్లండ్ వెళ్లారు. ఇప్పుడు ఆసియాకప్ టీ20 టోర్నీలో పాల్గోనున్నారు. భారత జట్టు ప్రస్తుతం చాలా పటిష్టంగా ఉంది.

మెన్ ఇన్ బ్లూ రెడ్ బాల్ క్రికెట్‌లోనే కాదు వైట్‌బాల్ క్రికెట్‌లో కూడా చాలా బలంగా ఉన్నారు. కాబట్టి భారత్ టైటిల్ దక్కించుకుంటుందని భావిస్తున్నారు. దుబాయ్ లాంటి మంచి పిచ్‌లపై భారత్‌ను ఓడించడం చాలా కష్టం అని గంగూలీ పీటీఐతో పేర్కొన్నాడు. కాగా భారత్ తమ ఆసియాకప్ ప్రయాణాన్ని సెప్టెంబర్ 10న హాంకాంగ్ మ్యాచ్‌తో ప్రారంభించనుంది.

# రాజస్తాన్ రాయల్‌స్‌తో నా జర్నీ ఒక అద్భుతం.. వారికి థ్యాంక్స్



**రాజస్తాన్ రాయల్స్ కెప్టెన్, టీమిండియా స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ గురుంచి పలు ఊహాగానాలు వినిపిస్తున్న సంగతి తెలిసిందే. ఐపీఎల్-2026 సీజన్‌కు ముందు శాంసన్ రాజస్తాన్ రాయల్‌స్‌ను వీడి చెన్నై సూపర్ కింగ్‌స్‌లో చేరనున్నట్లు ప్రచారం జరుగుతోంది.**

2013లో రాజస్తాన్ రాయల్స్ తరపున అరంగేట్రం చేసిన సంజూ.. 2021లో ఆ జట్టు కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. 30 ఏళ్ల సంజూ రాయల్స్ తరపున 11 సీజన్ల పాటు ఆడాడు. అయితే గత సీజన్‌లో సంజూ గాయం కారణంగా ఎక్కువ మ్యాచ్‌లకు బెంచ్‌కే పరిమితమయ్యాడు.

దీంతో పలు మ్యాచ్‌లకు రియాన్ పరాగ్ కెప్టెన్‌గా వ్యవహరించాడు. ఈ సమయంలో జట్టు యాజమాన్యంతో సంజూకు విభేదాలు తలెత్తినట్లు వార్తలు వచ్చాయి. జట్టు కూర్పు, ఓపెనింగ్ స్థానం విషయంలో సంజూ ఆంసృప్తిగా ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో సంజూ శాంసన్ తాజాగా రవిచంద్రన్ అశ్విన్ యూట్యూబ్ ఛానెల్‌లో ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. "రాజస్తాన్ రాయల్‌స్‌కు నాకు ప్రపంచం లాంటింది. కేరళలోని ఒక గ్రామం నుంచి నాకు నా టాలెంట్‌ను నిరూపించుకునేందుకు రాజస్తాన్ అవకాశమిచ్చింది. రాహుల్ ద్రవిడ్ సార్, మనోజ్ బదలే సారు నాకు ఎంతో మద్దతుగా నిలిచారు. రాయల్స్ ఫ్రాంచైజీ వల్లే క్రికెట్ ప్రపంచానికి నేను పరిచయమయ్యాను. అంతేకాకుండా నాపై ఎంతో నమ్మకంతో కెప్టెన్సీ కూడా అప్పగించారు. రాయల్‌స్‌తో ఈ ప్రయాణం నిజంగా ఒక అద్భుతం. రాజస్తాన్ వంటి ఫ్రాంచైజీలో ఉన్నందుకు నేను చాలా కృతజ్ఞుడను. ఇంతకు మించి నేను చెప్పలేను అని సంజూ శాంసన్ పేర్కొన్నాడు.

# ఆసియాకప్2025కు శుబ్‌మన్ గిల్ దూరం!?



**ఆసియాకప్-2025కు కౌంట్ డౌన్ ప్రారంభమైంది. మరో నెల రోజుల్లో యూఏఈ వేదికగా ఈ మెగా టోర్నీ షూరూ కానుంది. సెప్టెంబర్ 9న అబుదాబి వేదికగా తొలి మ్యాచ్‌లో హాంకాంగ్, అఫ్గానిస్తాన్ జట్లు తలపడనున్నాయి. ఈ ఆసియా సింహాల పోరు కోసం బంగ్లాదేశ్, అఫ్గానిస్తాన్ క్రికెట్ బోర్డులు తమ ప్రాథిమిక జట్లను ప్రకటించాయి.**

బీసీసీఐ సెలక్షన్ కమిటీ కూడా వచ్చే వారం భారత జట్టును ప్రకటించే అవకాశముంది. అయితే ఈ టోర్నీ కోసం భారత జట్టులో టెస్టు కెప్టెన్ శుబ్‌మన్ గిల్‌ను చేర్చాలా వద్దా అని సెలక్టర్లు తర్జబర్జన పడుతున్నట్లు తెలుస్తోంది. వెస్టిండీస్‌తో జరగనున్న టెస్ట్ సిరీస్‌ను దృష్టిలో ఉంచుకుని గిల్‌కు విశ్రాంతి ఇవ్వాలని అజిత్ అగార్కర్ అండ్ కో భావిస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి.

కాగా ఆసియాకప్ ముగిసిన నాలుగు రోజులకే భారత్‌వెస్టిండీస్ మధ్య రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ ప్రారంభం కానుంది. అయితే ఆసియాకప్‌నకు గిల్‌కు విశ్రాంతి ఇచ్చి టీ20 వరల్డ్ కప్2026లో అతడిని ఆడించాలని సెలక్టర్లు యోచిస్తున్నట్లు ది టెలిగ్రాఫ్ తమ కథనంలో పేర్కొంది.

కాగా గిల్ వెస్టిండీస్‌తో టెస్టు సిరీస్‌కు ముందు దులీప్ ట్రోఫీ2025లో ఆడనున్నాడు. నార్త్‌జోన్ కెప్టెన్‌గా శుబ్‌మన్ వ్యవహరించనున్నాడు. కాగా గిల్ ఇంగ్లండ్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లో కెప్టెన్‌గా, వ్యక్తిగత ప్రదర్శనంగా పరంగా ఆకట్టుకున్నాడు.

ఐదు మ్యాచ్‌లలో 75.40 సగటుతో 754 పరుగులు చేసి గిల్ ప్లేయర్ ఆఫ్‌ది సిరీస్‌గా నిలిచాడు. ఇక ఆసియాకప్‌లో భారత్ తమ తొలి మ్యాచ్‌లో సెప్టెంబర్ 10న దుబాయ్ వేదికగా యూఏఈతో తలపడనుంది. ఆ తర్వాత సెప్టెంబర్ 14న దాయాది పాకిస్తాన్‌తో మెన్ ఇన్ బ్లూ అమీతుమీ తెల్చుకోనుంది.

# 'నా కల... ప్రపంచకప్‌లో ఆడటం'

**ఆసియా కప్ టోర్నీకి అర్హత సాధించడంతో నమ్మకం పెరిగింది**

**భారత మహిళల ఫుట్‌బాల్ జట్టు ప్లేయర్ మనీషా వ్యాఖ్య**

**గువాహటి:** 'ఫిఫా' ప్రపంచకప్, ఒలింపిక్స్ వంటి ప్రతిష్టాత్మక టోర్నమెంట్‌లలో జాతీయ జట్టు తరఫున బరిలోకి దిగడం తన కల అని భారత మహిళల ఫుట్‌బాల్ జట్టు స్టార్ ప్లేయర్ మనీషా కల్యాణ్ పేర్కొంది. ఇటీవల చక్కటి ప్రదర్శన కనబరుస్తున్న భారత మహిళల ఫుట్‌బాల్ జట్టు వచ్చే ఏడాది ఆ‌ర్‌స్ట్రేలియాలో జరగనున్న ఆసియా కప్ టోర్నీకి అర్హత సాధించింది. దీంతో భవిష్యత్తులో ఒలింపిక్స్, ప్రపంచకప్ టోర్నీల్లో పాల్గొనగలమనే నమ్మకం పెరిగిందని మనీషా వెల్లడించింది.

శుక్రవారం గువాహటిలో జరిగిన 'అస్మిత' అండర్-13 బాలికల లీగ్ ప్రారంభోత్సవంలో మనీషా పాల్గొంది. ఈ సందర్భంగా 23 ఏళ్ల మనీషా మాట్లాడుతూ... 'యంగ్‌ప్లేయర్లు తమ కలలను సాకారం చేసుకునేందుకు 'అస్మిత'ఒక్క చక్కటి వేదిక. వరల్‌డ్‌కప్‌లో పాల్గొనాలనేది నా చిరకాల కల. వచ్చే ఏడాది ఆ‌ర్‌స్ట్రేలియాలో జరగనున్న ఆసియా కప్‌నకు అర్హత సాధించడంతో ఆ దిశగా మరింత నమ్మకం పెరిగింది' అని పేర్కొంది. మారుమూల ప్రాంతాల పిల్లల్లో దాగి ఉన్న నైపుణ్యాలను గుర్తించేందుకు 'అస్మిత' తోడ్పడుతోందని వెల్లడించింది.

అస్మిత గువాహటి లెగ్ పోటీల్లో 8 జట్లు పాల్గొంటుండగా... మనీషా ప్లేయర్లతో కాసేపు సరదాగా ఫుట్‌బాల్ ఆడింది. యూనియన్ ఆఫ్ యూరోపియన్ ఫుట్‌బాల్ అసోసియేషన్స్ (యూఈఎఫ్ఏ) చాంపియన్స్ లీగ్‌లో పాల్గొన్న ఏకైక భారత మహిళా ప్లేయర్‌గా రికార్డుల్లోకెక్కిన మనీషా... 'అస్మిత'వంటి వేదికతో యువ ఆటగాళ్లకు నాణ్యమైన మ్యాచ్‌లు ఆడే అవకాశం దక్కుతుందని చెప్పింది. 'అస్మిత' లీగ్ ద్వారా వెలుగులోకి వచ్చిన రేఖ కటాకీ, డొసోమి రోటియాను మనీషా ప్రత్యేకంగా అభినందించింది.

'ఈశాన్య రాష్ట్రాల ప్రజల రక్తంలోనే ఫుట్‌బాల్ ఉంది. స్టార్ ప్లేయర్ బాలాదేవి ఆట చూస్తూ పెరిగాను. ప్రస్తుత భారత మహిళల ఫుట్‌బాల్ జట్టులో 11 మంది ఈశాన్య రాష్ట్రాల ప్లేయర్లు ఉన్నారు. ఇక్కడి ప్లేయర్లలో ఎంత నైపుణ్యం ఉందో దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు. మరో ఐదేళ్లలో ఈ చిన్నారుల్లో నుంచి కూడా కొందరు రాష్ట్ర, జాతీయ జట్లకు ప్రాతినిధ్యం వహించవచ్చు. కష్టపడి పనిచేస్తే ఫలితం తప్పక ఉంటుంది. ఫిట్‌నెస్, నైపుణ్యం పెంపొందించుకుంటే ఏదైనా సాధ్యమే.

ప్రభుత్వ సహకారంతో ఈశాన్య రాష్ట్రాల్లో క్రీడా మౌలిక వసతులు పెరుగుతున్నాయి. దీంతో మరింత మంది వెలుగులోకి వస్తున్నారు' అని మనీషా వెల్లడించింది. ఇటీవలి కాలంలో ఈశాన్య రాష్ట్రాల ఆటలకు ప్రాధన్యతనిస్తున్న కేంద్ర ప్రభుత్వం... తాజా 'ఖేలో ఇండియా' క్రీడల్లో వాటిని చేర్చింది. ఈ పరిణామాన్ని మనీషా ఆహ్వానించింది. దీనివల్ల కేవలం ఫుట్‌బాల్‌కు కాకుండా... మిగిలిన ఆటలకు కూడా ఆదరణ పెరుగుతందని వెల్లడించింది.







# సెమీస్‌లో హరియాణా, ఛత్తీస్‌గఢ్

**యూపీ, జార్ఖండ్ కూడా**

**జాతీయ జూనియర్ మహిళల హాకీ**

జూనియర్ మహిళల జాతీయ హాకీ చాంపియన్‌షి ప్‌లో హరియాణా, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఉత్తర ప్రదేశ్ జట్లు సెమీఫైనల్‌స్‌కు అర్హత సాధించాయి. శనివారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో హరియాణా 4-1తో ఒడిశాపై ఘనవిజయం సాధించింది. హరియాణా జట్టులో కాజల్ (2వ ని.), సుప్రియా (27వ ని.), శశి ఖాస (36వ ని.), సాది (60వ ని.) తలా ఒక గోల్ చేశారు. ఒడిశా తరపున నమోదైన ఏకైక గోల్‌ను అమిషా ఎక్కా 47వ నిమిషంలో సాధించింది. ఛత్తీస్‌గఢ్ 2-1తో పెనాల్టీ షూటౌట్‌లో మధ్య ప్రదేశ్‌పై గెలిచింది. నిర్ణీత సమయంలో ఛత్తీస్‌గఢ్ నుంచి యశోద (2వ ని.), మధ్యప్రదేశ్ తరపున హుడా ఖాన్ (15వ ని.) గోల్ చేయడంతో 1-1తో డ్రా అయింది. మరో క్వార్టర్‌స్‌లో జార్ఖండ్ 3-1తో పంజాబ్‌ను ఓడించింది. పంజాబ్ జట్టులో పవన్‌ప్రీత్ కౌర్ (6వ ని.) గోల్ చేయగా, జార్ఖండ్ జట్టులో స్వీటి డంగ్‌డంగ్ (7వ ని), శాంతి కుమారి (22వ ని.), రోషిణి ఐంద్ (46వ ని.) తలా ఒక గోల్ చేశారు. ఆఖరి క్వార్టర్ ఫైనల్లో ఉత్తర ప్రదేశ్ 2-1తో మహారాష్ట్రపై నెగ్గింది. యూపీ తరపున సల్లు పుఖ్రంబమ్ (36వ ని.), రష్మీ పటేల్ (55వ ని.) చెరో గోల్ చేయగా, మహారాష్ట్ర జట్టులో దీక్షా షిండే (45వ ని.) ఒక గోల్ సాధించింది.

